క్లుప్తంగా

ఇస్కాన్‌లో వైభవంగా పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీ రాధా దామోదరులను ప్రత్యేకంగా అలంకరించిన అనంతరం పూజలు చేశారు. హరే రామ హరే కృష్ణ కీర్తనలు, అభిషేకాలు, పుష్పాభిషేకాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఉగాది నుంచి ఉచిత హిందీ శిక్షణ తరగతులు

తగరపువలస: ఈ ఏడాది సెప్టెంబరులో జరగనున్న దక్షిణ భారత హిందీ ప్రచారసభ పరీక్షలకు సంబంధించి ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 22న ఉగాది పర్వదినంతో భీమిలిలో ప్రారంభించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సెలవు రోజుల్లో భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో తరగతులకు హాజరు కావాలని ఆదర్శప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు కోరారు. వివరాలకు 89856 47419లో సంప్రదించాలని కోరారు.

నేడు రుద్రాభిషేకం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ శివాలయంలో సోమవారం మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం 5 గంటల నుంచి రుద్రాభిషేకం నిర్వహించనున్నామని ఆలయ అర్చకులు నుసరపు రామకృష్ణ శర్మ తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావాలని కోరారు.

శ్రీరామ నవమికి ఏర్పాట్లు

మధురవాడ: జాతర గట్టు చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు చెప్పారు. 22న బుధవారం ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని 30న ఉదయం 7 గంటలకు సీతారాముల ఉత్సవ విగ్రహాలు పురవీధుల్లో ఊరేగిస్తామన్నారు. మధ్యాహ్నం కల్యాణం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

గోతుల రోడ్డుతో అవస్థలు



గోతులమయమైన రోడ్డు

పద్మనాభం: మండలంలోని తునిపాలం రోడ్డు గోతులమయమై శిథిలమైంది. దీంతో రాకపోకలు సాగించడానికి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బాందేవుపురం రోడ్డు నుంచి తునిపాలం వరకు సుమారు కిలోమీటరున్నర నిడివి గల ఈ రోడ్డు పూర్తిగా గోతులమయమయింది. దీంతో ద్విచక్ర వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులు రాత్రి వేళల్లో గోతులను తనుక్కని పడిపోతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వీధి దీపాలు వెలగక ఇబ్బందులు

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ మిథిలాపురి వుడా కాలనీలో మూడు మాసాలుగా వీధి దీపాలు వెలగడం లేదని కాలనీకి చెందిన సుబ్బారావు అనే వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 646/ఎ1/3 నంబరు స్తంభానికి గల విద్యుత్ దీపం వెలగకపోవడంతో కుక్కలు, విష పురుగుల సంచారం పెరిగిందన్నారు. అలాగే పీఎం పాలెం పాత పోలీస్ స్టేషన్ రహదారి శిథిలమవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఉప్పు పంట వర్షార్పణం



మడుల వద్ద గట్లుపై కరిగిపోయిన ఉప్పు



ఉప్పు గల్లీల్లో నిలిచిన వర్షం నీరు

- సీజన్ ఊపందుకున్న తరుణంలో ఉత్పత్తికి తీవ్ర నష్టం
- ఆర్థికంగా నష్టపోయిన రైతులు

తగరపువలస: భీమిలి మండలం మూలకుద్దు ఉప్పు రైతులను మరోమారు వర్షాలు దెబ్బతీశాయి. శని, ఆదివారాల్లో కురిసిన వర్షాల కారణంగా ఇక్కడ సాగులో ఉన్న 20 ఎకరాల్లో చేతికి అందాల్సిన సుమారు రూ.3 లక్షల విలువైన ఉప్పు నీరుగారిపోయింది. ఏటా నవంబరులో ఉప్పు సీజన్ ప్రారంభమై జూలై వరకు తొమ్మిది మాసాలపాటు దిగుబడి ఉంటుంది. ఆరంభంలో తక్కువగా ఎకరాకు 5 బస్తాలతో ప్రారంభమయ్యే దిగుబడి ఎండలు పెరిగే కొద్దీ 35 బస్తాల వరకు పెరుగుతుంది. జూలై – ఆగస్టులో వర్షాకాలం ముగిసిన తర్వాత ఉప్పు సాగుకు గల్లీలతోపాటు సముద్రం నుంచి నీటిని తీసుకురావడానికి కాలువల తయారీకి రెండు మాసాలపాటు రైతులు శ్రమిస్తారు. గత ఏడాది నవంబరు, ఈ ఏడాది సంక్రాంతి సమయంలో వర్షాల కారణంగా ఆలస్యంగా ఫిబ్రవరిలో ఉప్పు సాగు ప్రారంభమయింది. ప్రస్తుతం ఎండలు ముదురుతుండగా కురిసిన వర్షాల కారణంగా గట్లపై చేర్చిన, ఒడ్డున కుప్పలు పెట్టిన ఉప్పు కరిగిపోవడంతో లీజు రైతులు బేలచూపులు చూస్తున్నారు. మళ్లీ ఉప్పు మడులు సిద్ధం కావడానికి నెల రోజుల సమయం పడుతుందని రైతులు అంటున్నారు.



వర్షానికి కుప్పల నుంచి కరుగుతున్న ఉప్పు

లీజు రైతులను ముంచిన గల్లీలు

మూలకుద్దులో 99 ఎకరాల్లో ఉప్పు గల్లీలు ఉండగా సీజన్‌లో 300 మంది వరకు ఉపాధి పొందుతుండేవారు. గల్లీల్లో పనులు కష్టంగా ఉండటంతో చాలా వరకు రైతులు ఉప్పుసాగుకు దూరమయ్యారు. ఈ ఏడాది 20 ఎకరాల్లో మాత్రమే సాగుకు లీజురైతులు ముందుకు వచ్చినా మూడు సార్లు కురిసిన అకాల వర్షాలు మోసం చేసినట్టయింది. ప్రస్తుతం 50 కిలోల ఉప్పు మార్కెట్‌లో రూ.500 వరకు డిమాండ్ ఉండగా వర్షాలు దెబ్బతీయడంతో మళ్లీ మొదటికి వచ్చినట్టయింది.

మళ్లీ పెట్టుబడి పెట్టాలి



రెండు రోజులపాటు కురిసిన వర్షాల కారణంగా ఉప్పు గల్లీలు నీటితో నిండిపోయాయి. మళ్లీ మొదటి నుంచి పెట్టుబడులు పెట్టాలి. సముద్రం మడులకు నీరు తీసుకొచ్చి నిల్వ చేసుకోవడానికి మోటార్లు వినియోగించాలి. మడులలో మట్టి చేసి ఎండగట్టిన తర్వాత సాగుకు సరైన ఎండ అవసరం. దీనికి మళ్లీ మొదటి నుంచి పెట్టుబడులు అవసరం అవుతాయి.

– బవిరిశెట్టి పోలయ్య, ఉప్పు సాగు రైతు

మల్లు స్వరాజ్యం పోరాటం మరువలేనిది



స్వరాజ్యం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ, ఐద్వా నాయకులు

మధురవాడ: భారత స్వాతంత్ర్య ఉద్యమ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్ధంతిని కొమ్మాది జంక్షన్ సమీపంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అఖిల భారత మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఐద్వా ప్రధాన కార్యదర్శి బి.భారతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం నవాబు పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం, భుక్తి కోసం, బానిసత్వం నుంచి విముక్తి కోసం జరిగిన సాయిధ పోరాటానికి నాయకత్వం వహించిన వీర వనితని కొనియాడారు. నేటి తరానికి ఆమె ఆదర్శం అన్నారు. కార్యక్రమంలో ఐద్వా, సీఐటీయూ నాయకులు డి.అప్పలరాజు, డి.కొండమ్మ, జి.కిరణ్, టి.గోవిందు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా పూనిగట్టు

కాజ్‌వేగా మార్చాలని కోరుతున్న ప్రజలు



చిట్టివలస జ్యూట్‌మిల్లు అవుట్ గేట్ సమీపంలో శిథిలమైన రాళ్లతో గోస్తనీపై నిర్మించిన పూనిగట్టు

తగరపువలస: చిట్టివలస జ్యూట్‌మిల్లు నీటి అవసరాల కోసం బ్రిటిష్ వారి హయాంలో గోస్తనీనదిపై రాళ్లతో నిర్మించిన పూనిగట్టు ప్రస్తుతం ప్రమాదకరంగా మారిపోయింది. నది ద్వారా ప్రవహించిన నీరు సముద్రంలో కలవకుండా రాళ్లతో నదికి అడ్డంగా నిర్మించిన ఈ వంతెన మిల్లులో యంత్రాలు నడపడానికి వినియోగించేవారు. ఈ పూనిగట్టు వద్ద నిలిచిన నీటిని చిట్టివలస పోలమ్మ ఆలయం ముందు కృత్రిమ కోనేటిలో నిల్వచేసి తద్వారా బాయిలర్ గేట్ వద్ద యంత్రాలతో వేడి చేసి జనించే శక్తితో యంత్రాలు నడిచేవి.

విద్యుత్ అందుబాటులోకి వచ్చిన తర్వాత మిల్లు యాజమాన్యం పూనిగట్టు నిర్వహణను గాలికి వదిలేసింది. తర్వాత కార్మికులే మిల్లు పనివేళల్లో రాకపోకలకు ఈ రాళ్ల వంతెనను వినియోగించుకుని ఎప్పటికప్పుడు సరిచేసుకునేవారు. మూడు షిఫ్టులలో వందలాది మంది కార్మికులు దీనిని దాటుకుని వచ్చేవారు. 2009లో మిల్లు మూతపడటం, చుట్టూ రహదారులు అందుబాటులోకి రావడంతో పూనిగట్టు మూతపడింది. అయినప్పటికీ ఇప్పటికీ చేపలు పట్టేందుకు వచ్చే మత్స్యకారులు, నది అవతలకు వెళ్లే వారు ప్రమాదకరంగా ఉన్న ఈ రాళ్లపై నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో ఈ రాళ్ల వంతెనను కాజ్‌వేగా మారుస్తామని పలు ప్రభుత్వాలు ప్రతిపాదనలు తయారు చేశారు. పూనిగట్టుకు మరమ్మతులు చేస్తే నీరు నిల్వ ఉండి తాగునీటి అవసరాలు తీరుతాయని స్థానికులు భావించారు. అనంతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. ప్రమాదకరంగా ఉన్న ఈ రాళ్ల వంతెనను కాజ్‌వేగా మార్చాలని నదికి ఇరువైపులా ఉన్న ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక సాధనతో మానసిక శాంతి



ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో యోగా చేస్తున్న సాధకులు

ఆరిలోవ: యాంత్రిక జీవనంలో ఆధ్యాత్మిక సాధనతోనే మానసిక శాంతి లభిస్తుందని ఆనంద్‌మార్గ్ సీనియర్ ఆచార్య జ్యోతి ప్రకాష్ అవధూత తెలిపారు. జీవీఎంసీ 10వ వార్డు పరిధి డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌లోని ఆనంద్‌మార్గ్ ఆశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ ఆధ్యాత్మిక సదస్సు ఆదివారం ముగిసింది. ఈ సదస్సులో వివిధ రాష్ట్రాలలో ఆనంద్‌మార్గ్ ఆశ్రమాల నుంచి వచ్చిన ఆచార్యులు ఇక్కడ ఉచిత యోగా, ధ్యానం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు చేశారు. వారితో పాటు నగరానికి చెందిన కొందరు సాధకులు కూడా ఈ శిబిరంలో పాల్గొని యోగా సాధన చేశారు. ముగింపు సందర్భంగా ఆచార్య జ్యోతి ప్రకాష్ మాట్లాడుతూ మనిషి సంపూర్ణ ఎదుగుదలకు ఆధ్యాత్మిక సాధనతో పాటు సామాజిక సేవలు కూడా అవసరమన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక సదస్సులో వివిధ రాష్ట్రాల నుంచి 50 మంది సన్యాసులు, మరో 150 మంది ఆనంద్‌మార్గ్ ఆశ్రమాల సభ్యులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పరమేశ్వర ఆనంద్ అవదూత, సౌమ్యానంద్, సుశ్రుతానంద్, ఇష్టప్రేమ, అనిమిష ఆనంద్, శుచిలేక ఆనంద్ పాల్గొన్నారు.

నేటి నుంచి నూకాలమ్మ ఉత్సవాలు

ఏర్పాట్లు పూర్తిచేసిన ఉత్సవ కమిటీ



ఉత్సవ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు



నూకాలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్లు

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల ఉత్సవాల్లో భాగంగా ముందుగా తొలేళ్ల సంబరం నిర్వహించనున్నారు. సోమవారం రాత్రి గంట స్తంభం వద్దనున్న వేదిక ఎదురుగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు, బళ్లవేశాలు, పులివేషాలు ప్రదర్శించనున్నారు. మంగళవారం వైభవంగా అనుపోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులు పెద్దబజారులోని ఎగువపేట, గంటస్తంభం, చిన్నబాజారు వేదికల వద్ద పలు నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వాహక అధికారి కీర్తి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి వీలుగా క్యూలైన్లు, షామియానాలు ఏర్పాటు చేశారు.

ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

అమ్మవారి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కమిటీ అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీరావు, పెద్దల సమక్షంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించడానికి అవసరమైన పూర్తి ఏర్పాట్లు చేశామని తెలిపారు. భక్తులకు సదుపాయాల కల్పనకు అందరూ సహకరించాలని కోరారు. కమిటీ ప్రధాన కార్యదర్శి రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, కోశాధికారి కాసరపు ఎల్లాజీ, నమ్మి శేషాద్రియాదవ్, ముమ్మిడిశెట్టి సునీల్, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుపల్లి కొండబాబు, మైలిపల్లి షణ్ముఖరావు, అల్లిపిల్లి నర్సింగరావు, గంటా నూకరాజు, కంటుభుక్త ముత్యాలరావు, బొండ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

అభిమానులు తగ్గేదేలే..



స్టేడియం వద్ద అభిమానుల సెల్ఫీల సందడి



స్టేడియం వెలుపల అభిమానులు



స్టేడియంలో అభిమానుల సెల్ఫీ



జాతీయ జెండా రెపరెపలతో చిన్నారి అభిమాని

మధురవాడ / పీఎం పాలెం: ప్రతికూల వాతావరణాన్ని సైతం లెక్క చేయకుండా అభిమాన క్రీడాకారులు ఆడే క్రికెట్ మ్యాచ్ వీక్షించేందుకు యువత, పిల్లలు అధిక సంఖ్యలో మధురవాడలోని వైఎస్సార్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియానికి ఆదివారం తరలి వచ్చారు. మారికవలస నుంచి ఎండాడ వరకూ ఎటు చూసినా దారులన్నీ క్రికెట్ స్టేడియం వైపే బారులు తీరాయి. ఉదయం 10 గంటల వరకూ మ్యాచ్ జరుగుతుందో లేదోనన్న అనుమానం వెంటాడుతున్నా ఎక్కడా అభిమానులు తగ్గలేదు. తమ అభిమాన క్రికెటర్ల ఆట చూసి తరించాలని స్టేడియానికి చేరుకున్నారు. స్టేడియం వద్ద భారత జాతీయ జెండాను చేతబూని తమ దేశాభిమానం చాటుకున్నారు. స్టేడియం వెలుపల ఉన్న క్రీడాభిమానులను నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పర్యవేక్షణలో పోలీసు యంత్రాంగం నియంత్రించారు. సిబ్బంది పాస్‌లు చెక్ చేసి స్టేడియం లోనికి అనుమతించారు. మరోవైపు బ్లాక్ టికెట్లు భారీగానే విక్రయించారు.



పాస్‌లు తనిఖీ చేస్తూ అనుమతిస్తున్న పోలీసులు

కేజీహెచ్‌లో నీటిశుద్ధి యంత్రం ఏర్పాటు



నీటిశుద్ధి యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఉషామాధవి

మహారాణిపేట : టచ్ స్టోన్ చారిటీస్, హరేకృష్ణ మూవ్‌మెంట్ సంస్థలు సంయుక్తంగా కేజీహెచ్ సుభోజనం వద్ద నీటిశుద్ధి యంత్రాన్ని ఆదివారం ఏర్పాటు చేశాయి. హరేకృష్ణ మూవ్‌మెంట్ సేవలను గుర్తించి ఈ యంత్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. దీని ద్వారా రోజుకు 200 నుంచి 1000 లీటర్ల మంచి నీరు రోగి సహాయకులకు అందుతుందని రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్‌కు చెందిన దత్త సుబ్బారావు తెలిపారు. తమకు సహకరించిన వారికి శ్యామ మాధవ దాస ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ విశాఖ కపుల్స్ జిల్లా గవర్నర్ దత్త సుబ్బారావు, క్లబ్ వైజాగ్ సెక్రటరీ వి.ఉషామాధవి, అధ్యక్షుడు సుబోధ్‌కుమార్, హరేకృష్ణ మూవ్‌మెంట్‌కు చెందిన యదు రాజాదాస, కృష్ణారావు, టచ్ స్టోన్ చారిటీస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

దాబాగార్డెన్స్: మహాత్మాగాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ పథకం కింద నెలకు 200 రోజులు పని కల్పిస్తూ, రోజుకు రూ.600 కనీస వేతనం ఇవ్వాలని సిటూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. సిటూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాణ్యమైన చదువు, వైద్యం, నిత్యావసర సరకులు అందించాలని, ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మే ఆలోచనను బీజేపీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, నాలుగు కార్మిక కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీస పెన్షన్ రూ.10 వేలు చెల్లించాలంటూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ ప్రభుత్వం కార్మిక వర్గంపై దాడి చేస్తుందని, రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని, దేశంలో ప్రభుత్వరంగ పరిశ్రమలను అమ్మేస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎస్, జ్యోతీశ్వరరావు, పి. వెంకటరెడ్డి, కుమార మంగళం, బి. జగన్ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యత శిబిరానికి ఏయూ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు తరలివెళ్లారు. డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలకు చెందిన అధ్యాపకుడు డాక్టర్ పి.ఉమామహేశ్వరరావు ప్రొగ్రాం అధికారిగా ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఒడిశా రాష్ట్రం పూరీలో ఈ నెల 25వ తేదీ వరకు నిర్వహించే జాతీయ సమైక్యత శిబిరంలో ఏయూ ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా వారిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రాం అధికారి ఆచార్య ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

నేత్ర విద్యాలయానికి సరకుల వితరణ

ఎంవీపీ కాలనీ: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భీమిలి బీచ్ రోడ్డులోని నేత్ర విద్యాలయానికి నిత్యావసర సరకులు అందజేశారు. శ్రీచిన జీయర్ స్వామి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ నేత్ర విద్యాలయానికి తరచూ కమిటీ సభ్యులు సరకులు అందజేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రూ.35 వేలు విలువ చేసే ఆహార పదార్థాలు, సరకులను విద్యాలయం ప్రతినిధులకు ఆదివారం అందజేశారు.

విశేషంగా నిత్య కల్యాణం



జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం నుంచి 10.30గంటల వరకు ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు అప్పాజీ, శ్రావణ్ తదితరులు ఈసేవ నిర్వహించారు.

వృద్ధులకు ఉపకరణాల అందజేత

పరవాడ: హెల్పేజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు కొనియాడారు. హెల్పేజ్ సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ యూనిట్ ద్వారా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, కలపాక గ్రామాల్లో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 2 చక్రాల కుర్చీలు, 12 చేతి కర్రలు, 8 వాకర్లను గొరుసు వానిపాలెం, కలపాక, వెంకటపతిపాలెం, వాడచీపురుపల్లి గ్రామాలకు చెందిన వృద్ధులకు అందజేశారు. నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వృద్ధులకు సేవ లు అందించడం ప్రశంసనీయమన్నారు. కోరారు. సంస్థ ప్రతినిధి కేవీ రావు మాట్లాడుతూ తమ సేవలు అవసరమైన వృద్ధులు 14567 హెల్ప్ లైన్ నంబరును సంప్రదించాలని కోరారు.



వృద్ధురాలికి వాకర్ అందజేసిన హెల్పేజ్ ఇండియా ప్రతినిధులు

రహదారులు జలమయం



హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్డుపై నిలిచిన నీరు

పీఎం పాలెం: ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో పీఎం పాలెం పరిధిలోని పలు రహదారులు చిత్తడిగా మారాయి. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని అంతర రహదారుల్లోని గోతుల్లో వాన నీరు చేరడంతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు స్పందించి గతుకులు పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.